సందేశం

# పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను 2025 డిసెంబర్ 2 నుండి 8 వరకు దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకుందాం.

**విప్లవ ప్రతిఘాతక ‘కగార్’ యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.**

**సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.**

**పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు, ప్రజా నిర్మాణాలకు, పీడిత ప్రజలకు సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ), సీపీఐ (మావోయిస్టు) పిలుపు!**

**సెంట్రల్ మిలిటరీ కమిషన్**

**సీపీఐ (మావోయిస్టు)**

# పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను 2025 డిసెంబర్ 2 నుండి 8 వరకు దేశవ్యాప్తంగా విప్లవోత్సాహంతో జరుపుకుందాం.

## విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.

## సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవ విజయసాధన కోసం ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్న ప్రజావిముక్తి గెరిల్లా సైన్యానికి (పీ.ఎల్.జీ.ఏ.) ఈ డిసెంబర్ 2 నాటికి 25 ఏళ్లు నిండుతాయి. ఈ సందర్భంగా డిసెంబర్ 2 నుండి 8 వరకు పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో విప్లవోత్సాహంతో, దృఢసంకల్పంతో జరపాల్సిందిగా యావత్తు పార్టీ కమీటీలకు, పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. కమాండ్లకు, యూనిట్లకు, ప్రజాసంఘాలకు, విప్లవ ప్రజానీకానికి సెంట్రల్ మిలిటరీ కమిషన్ (సీఎంసీ) పిలుపునిస్తోంది.

"విప్లవ ప్రతిఘాతక యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్–బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దామని" ఈ సందర్భంగా యావత్తు విప్లవ శిబిరానికి సీఎంసీ పిలుపునిస్తోంది.

పీ.ఎల్.జీ.ఏ. 24వ వార్షికోత్సవాల సందర్భంగా యావత్తు పార్టీకి, పీ.ఎల్.జీ.ఏ.కు, ప్రజా నిర్మాణాలకు, విప్లవ ప్రజానీకానికి సీఎంసీ ఇచ్చిన కర్తవ్యాల సాధన కోసం గత సంవత్సరకాలంగా ఉత్సాహంతో, దృఢసంకల్పంతో, ధైర్యసాహసాలతో కృషిచేస్తున్న యావత్తు పార్టీ కమిటీలకు, పార్టీ శ్రేణులకు, పీ.ఎల్.జీ.ఏ. కమాండ్లకు, కమాండర్లకు–యోధులకు, ప్రజాసంఘాల నాయకులకు–కార్యకర్తలకు, ప్రజా మిలిషియా సభ్యులకు, విప్లవ ప్రజానీకానికి సీఎంసీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. గత సంవత్సర కాలంగా కొనసాగుతున్న 'కగార్' విప్లవ ప్రతిఘాతక యుద్ధాన్ని సాహసోపేతంగా ఎదుర్కొంటూ సాగుతున్న రాజకీయ, సైనిక, నిర్మాణ, సాంస్కృతిక, టెక్నికల్ కృషిలో పాల్గొంటున్న కామ్రేడ్స్ కందరికీ సీఎంసీ విప్లవాభినందనలు తెలియజేస్తోంది. దేశంలో విప్లవోద్యమ ప్రాంతాల్లో సాగిన గెరిల్లాయుద్ధ చర్యల్లో గాయపడిన కామ్రేడ్స్ త్వరగా కోలుకుని సమరోత్సాహంతో గెరిల్లాయుద్ధంలో తమవంతు బాధ్యత నిర్వహిస్తారని సీఎంసీ విశ్వసిస్తోంది.

గత సంవత్సర కాలంగా సాగుతున్న కగార్ యుద్ధాన్ని సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ అసువులు బాసిన వీర గెరిల్లాలకూ, చుట్టివేత దాడుల్లో (ఎన్ సర్కిల్ మెంట్ దాడుల్లో), ఎన్ కౌంటర్లలో, బూటకపు ఎన్ కౌంటర్లలో, శత్రువుపై చేసిన యుద్ధ చర్యల్లో, విద్రోహాలలో, దుర్ఘటనల్లో, అనారోగ్యంతో, ఇంకా ఇతర కారణాలతో అసువులు బాసిన అమరవీరులందరికీ సీఎంసీ తలవంచి వినమ్రంగా విప్లవ జోహార్లు అర్పిస్తోంది. 2024 జనవరి నుండి ప్రారంభమయి, గత సంవత్సర కాలంగా రోజురోజుకు మరింత భీకరంగా సాగుతున్న కగార్ యుద్ధానికి బెదరకుండా, ప్రాణమున్నంత వరకు ప్రతిఘటనే మా మార్గం అంటూ శత్రువును ప్రతిఘటిస్తూ, తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమరుల అసమాన ధైర్యసాహసాలు, శత్రువుకు తలవంచని వారి ధీరోదాత్తత, చావుకు వెరవని, అలుపెరగని మావోయిస్టు పోరాటశైలి, ప్రజల పట్ల వారి అంకితభావం, త్యాగనిరతి, విప్లవ విజయం పట్ల వారి అచంచల విశ్వాసం మనకు సదా ఆదర్శనీయం, అనుసరణీయం. వారి త్యాగాలను ఎత్తిపడదాం, వారి వీరోచిత ప్రతిఘటన వీరగాధలను ప్రపంచానికి చాటిచెపుదాం, వారి ఆదర్శాలను గానం చేద్దాం, వారి అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయ సాధనకోసం చివరి శ్వాస వరకు దృఢంగా పోరాడుదామని శపథం చేద్దాం.

భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో విప్లవ ప్రతిఘాతక కగార్ యుద్ధాన్ని ప్రతిఘటిస్తూ గత 11 నెలల కాలంలో (డిసెంబర్ 2024 నుండి 2025 నవంబర్ వరకు) దేశవ్యాప్తంగా 320 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో 183 మంది పురుష కామ్రేడ్స్, 117 మంది మహిళా కామ్రేడ్స్, వివరాలు తెలియనివారు 20 మంది ఉన్నారు.

బిహార్-ఝార్ఖండ్ లో 22 మంది, అస్సాంలో ఒకరు, డీకేలో 243 మంది, ఒడిషాలో 33 మంది, ఎంఎంసీలో 7 మంది, తెలంగాణలో 8 మంది, ఏఓబీలో 6 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. వీరిలో మనపార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (బీఆర్) సహ 8 మంది కేంద్రకమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్రకమిటీ స్థాయి కామ్రేడ్స్, 25 మంది జిల్లా కమిటీ స్థాయి కామ్రేడ్స్, 73 మంది ఏరియా కమిటీ స్థాయి కామ్రేడ్స్, 116 మంది పార్టీ సభ్యులు, 13 మంది పీ.ఎల్.జీ.ఏ. సభ్యులు, 33 మంది స్థానిక ప్రజా నిర్మాణాల కామ్రేడ్స్, విప్లవ ప్రజలు ఉన్నారు. వీరితో పాటు స్థాయిల వారీగా వివరాలు తెలియని వారు 37 మంది వున్నారు. వీరితో పాటుగా దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలలో పనిచేసే పలువురు విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక సంఘాల నాయకులు, కార్యకర్తలు, మేధావులు, విప్లవ సానుభూతిపరులు, మిత్రులు కన్నుమూసారు. ఫిలిప్పీన్స్ విప్లవోద్యమంలో ఆ దేశ విప్లవ కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ) కేంద్రకమిటీ సభ్యులు, నూతన ప్రజాసైన్యపు కమాండర్లు, సభ్యులు, నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ నాయకులు, కార్యకర్తలు కొంతమంది అమరులయ్యారు. అమెరికా దన్నుతో యూదు దురంహకార ఇజ్రాయిల్ ప్రభుత్వం పాలస్తీనాలోని గాజా ప్రజలపై గత 2 సంవత్సరాలుగా సాగిస్తున్న నరసంహార యుద్ధంలో దాదాపు

75 వేల మంది పాలస్తీనా ప్రజలు, పోరాటకారులు అమరులయ్యారు. ఈ అమరులందరికీ సీఎంసీ విప్లవ జోహార్లు అర్పిస్తోంది.

కగార్ యుద్ధంలో మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు సహా 8 మంది కేంద్రకమిటీ సభ్యులను, 15 మంది రాష్ట్రకమిటీ సభ్యులను, మొత్తంగా 320 మంది కామ్రేడ్స్ ను కోల్పోయి, విప్లవోద్యమం తీవ్రమైన నష్టాల పాలవుతున్న స్థితిలో, సోను, సతీష్ ల ముఠా శత్రువుకు ఆయుధాలు అప్పగించి, లొంగిపోయి విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం కలిగించిన స్థితిలో మనం పీ.ఎల్.జీ.ఏ. 25వ వార్షికోత్సవాలను జరుపుకుంటున్నాం. ఈ స్థితిలో విప్లవోద్యమ భవిష్యత్తు పట్ల విప్లవ శిబిరంలో తలెత్తుతున్న ప్రశ్నలకు జవాబునిస్తూ, భయాందోళనలకు గురయిన వారికి ధైర్యాన్ని కల్పిస్తూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, దృఢ సంకల్పంతో, అసమాన ధైర్యసాహసాలతో యావత్తు విప్లవ శిబిరాన్ని విప్లవోద్యమంలో ముందుకు నడపడమే మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. కర్తవ్యం. ఈ కర్తవ్య సాధనలో భాగంగానే పీ.ఎల్.జీ.ఏ. వార్షికోత్సవాలను జరుపుకుందాం.

ఈ కర్తవ్య సాధన కోసం ప్రస్తుతం విప్లవోద్యమంలో జరుగుతున్న తీవ్రమైన నష్టాలకు కారణాల్ని గుర్తించి వాటిని సరిదిద్దుకుందాం. భౌతిక పరిస్థితిలో (అబ్జెక్టివ్ కండిషన్), స్వీయాత్మక పరిస్థితిలో (సబ్జెక్టివ్ కండిషన్) విప్లవోద్యమ పురోగమనానికి అనుకూలంగా పెంపొందుతున్న అంశాలను గుర్తించి వాటి ఆధారంగా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను సంఘటితం చేసుకుందాం.

కగార్ యుద్ధ ప్రారంభం నుండి మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, స్థానిక రహస్య ప్రజా నిర్మాణాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, దెబ్బతింటున్నాయి. దీనికి కారణం మౌలికంగా మన నిర్మాణాలు, బలగాలు పాటించాల్సిన రహస్య పనివిధానాన్ని, గెరిల్లాయుద్ధ నియమాలను అమలు చేయకపోవడంతో పాటు కేంద్రకమిటీ రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడలను సరిగా అమలు చేయకపోవడంలో ఉంది. మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరోలు రూపొందించిన ఎత్తుగడల ప్రకారం మన బలగాలు చిన్న ప్రాంతాలకు పరిమితం కాకుండా, విశాల ప్రాంతాల్లో పనిచేయాలి; కేంద్రీకృతమయి ఉండకుండా వికేంద్రీకృత బలగాలుగా, చిన్న ఫార్మేషన్లుగా మారి పనిచేయాలి. చట్టబద్ధ–చట్టవ్యతిరేక, బహిరంగ–రహస్య పోరాట, నిర్మాణ రూపాల్ని సమన్వయించి వర్గపోరాటాన్ని నడపాలి. పట్టణ, మైదాన, అటవీ ప్రాంతాల్లో కార్మిక, రైతాంగ, మధ్యతరగతి (పెటిబూర్జువా), జాతీయ పెట్టుబడిదారీ వర్గాలను, పీడిత సామాజిక సెక్షన్లను, పీడిత జాతులను విప్లవోద్యమంలో సమీకరించాలి. ఈ ఎత్తుగడలను మనం సరిగా ఆచరించని ఫలితంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, నాయకత్వ శక్తులు తీవ్రంగా నష్టపోయాయి, నష్టపోతున్నాయి. అలాగే 'కగార్' యుద్ధానికి ప్రధాన కేంద్రీకరణగా ఉన్న దండకారణ్య ప్రాంతం నుండి పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలను ఇతర ప్రాంతాలకు రిట్రీట్ చేయకపోవడంతో మన బలగాలు తీవ్రంగా నష్టపోయాయి.

గత 22 నెలలుగా మన ఆచరణలో జరిగిన తప్పులను గుర్తించి వాటిని సరిదిద్దుకోవడం ద్వారా మన కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరోలు రూపొందించిన ఎత్తుగడలను సరిగా అమలు చేయడం ద్వారా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కగార్ యుద్ధంలో విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టాలు కలిగిస్తున్నప్పటికీ మనపార్టీ నాయకత్వంలో పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, విప్లవ ప్రజలు చేస్తున్న ఆత్మరక్షణ యుద్ధంలో, ప్రతిఘటనలో శత్రుసాయుధ బలగాలు కూడా గణనీయంగా నష్టపోతున్నాయి. ఈ నష్టాల్ని ప్రకటిస్తే విప్లవ శిబిరపు మొరేల్ పెరుగుతుందనే దాంతో శత్రువు వీటిని ప్రకటించడం లేదు. ఇది మానసిక యుద్ధంలో భాగం. ఈ మానసిక యుద్ధపు ప్రభావానికి విప్లవ శిబిరం గురికాకూడదు. గత సంవత్సర కాలంలో, దండకారణ్యం, బిహార్–ఝార్ఖండ్, తూర్పుబిహార్–ఈశాన్య ఝార్ఖండ్, ఒడిశా, ఎంఎంసీల్లో కేంద్ర, రాష్ట్ర సాయుధ బలగాలకు, వివిధ రకాల కమాండో బలగాలకు చెందిన 116 మంది పోలీసులు నిర్మూలించబడి, 208 మంది గాయపడ్డారు. కొంతమంది గోపనీయ సైనికులను, పోలీసు ఇన్ఫార్మర్లను, బీజేపీకి చెందిన ప్రజా శత్రువులైన రాజకీయ నాయకులను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు నిర్మూలించాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో వున్న కొన్ని వాహనాలను, కొన్ని మొబైల్ టవర్లను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు కాల్చివేసాయి. దేశవ్యాప్తంగా దాదాపు 72 ఎన్ సర్కిల్ మెంట్ దాడుల్లో, ఎన్ కౌంటర్లలో పోలీసు, పారామిలిటరీ (కేంద్ర సాయుధ పోలీసు బలగాలు), కమాండో, భారత సైనిక బలగాలను పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ప్రతిఘటించాయి.

గత సంవత్సర కాలంలో 'కగార్' యుద్ధాన్ని విఫలం చేసేందుకు మన పీ.ఎల్.జీ.ఏ. బలగాలు ప్రధానంగా ఇంప్రూవైజ్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైస్ (ఐఈడీ)లను అమర్చి శత్రు సాయుధ బలగాలను దెబ్బతీయడం, ఎన్ సర్కిల్ మెంట్ దాడులను, ఎన్ కౌంటర్లను సాహసోపేతంగా ప్రతిఘటించడం, ఆంబుష్ లు, పోలీసు ఇన్ఫార్మర్ల నిర్మూలన, ప్రజా శత్రువులైన బీజేపీ నాయకుల నిర్మూలన, స్పైక్ హోల్స్ అమర్చడం అనే ఎత్తుగడలను ఉపయోగించి గెరిల్లాయుద్ధాన్ని సాగించాయి.

ఈ సంవత్సరం కూడా గెరిల్లాచర్యల విస్తృతి, తీవ్రత తగ్గింది. దాని ఫలితంగా పోలీసులను నిర్మూలించే, గాయపరిచే చర్యలు తగ్గాయి. ఈ సంవత్సరం శత్రుసాయుధ బలగాల నుండి 5 ఆయుధాల్ని మాత్రమే పీ.ఎల్.జీ.ఏ. స్వాధీనం చేసుకోగలిగింది. మరోవైపు 'కగార్' యుద్ధంలో మనపార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా నష్టపోయాయి. దీంతో దేశవ్యాప్త విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయింది.

దేశవ్యాప్త విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయినప్పటికీ దేశంలో పార్టీ యూనిట్లు వున్న ప్రతిచోటా వివిధ స్థాయిల్లో విప్లవ రాజకీయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే రాజకీయ కృషి (పొలిటికల్ వర్క్) చేయడం, ప్రజలను కదిలించి సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (సీబీబీ), భూస్వామ్య వ్యతిరేక, కార్పొరేటీకరణ, సైనికీకరణ వ్యతిరేక పోరాటాలను కొనసాగిస్తుండడం, ప్రజలను వివిధ రకాల ప్రజా నిర్మాణాల్లో సంఘటితం చేయడం, ప్రజలపై, ప్రజా మిలిషియాపై

ఆధారపడి పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. చిన్న, వికేంద్రీకృత చర్యల రూపంలో ఆత్మరక్షణ గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిస్తుండడం, కగార్ (అంతిమ యుద్ధం) పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవోద్యమ ప్రాంతాల్లో 8,50,000 పోలీసు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలను, కమాండో బలగాలను, భారతసైన్యాన్ని, వాయుసైన్యాన్ని మోహరించి చుట్టివేత-నిర్మూలన దాడులు చేస్తున్నప్పటికీ ఆ దాడులను అత్యంత ధైర్యసాహసాలతో ప్రతిఘటించడం, చుట్టివేతలను గండికొట్టి బయటపడడం, ఛత్తీస్ గఢ్, మహరాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని అన్నిరకాల సాయుధ బలగాలను, కేంద్ర సాయుధ బలగాలను, కమాండో బలగాలను, భారత సైన్యాన్ని, వాయు సైన్యాన్ని కలుపుకుని 50 వేలకు మించిన సంఖ్యలో సాయుధ బలగాలను మోహరించి అమెరికా, ఇజ్రాయిల్ సైనిక అధికారుల, టెక్నిషియన్ల భాగస్వామ్యంతో సాగిన కర్రెగుట్ట అభియాన్ ను విఫలం చేయడం, గత 3 సంవత్సరాలుగా ఝార్ఖండ్ లోని పశ్చిమ్ సింగ్ భుమ్ జిల్లాలో కేంద్రీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడులు చేస్తున్నప్పటికీ వాటిని ప్రతిఘటిస్తూ శత్రు సాయుధ బలగాలకు గణనీయమైన సంఖ్యలో నష్టాలు కలిగించడం వగైరాలు మన సకారాత్మక అంశాలు. ఈ సకారాత్మక అంశాలను సంఘటితం చేసుకుంటూ తాత్కాలిక వెనకంజ నుండి విప్లవోద్యమాన్ని పురోగమింపచేద్దాం.

**విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకోవడం కోసం కింద పేర్కొంటున్న రాజకీయ, నిర్మాణ, సైనిక కర్తవ్యాల సాధన కోసం కృషి చేద్దాం :**

**1. స్వీయాత్మక బలగాల రక్షణకు ప్రధాన్యతనీయాలి, నష్టాల్ని నివారించుకోవాలి.**

గత సంవత్సర కాలంలో దేశవ్యాప్తంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ప్రజాసంఘాలకు చెందిన 320 మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. మన పార్టీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన కామ్రేడ్ చారుమజుందార్ అమరుడైన 53 ఏళ్ల తర్వాత మన పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజు అమరుడు కావడం మనపార్టీకి, విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టం. ఈ సంవత్సర కాలంలో 8మంది కేంద్రకమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్రకమిటీ సభ్యులు అమరులు కావడంతో మన కేంద్ర, రాష్ట్ర కమిటీలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నష్టాలు విప్లవోద్యమాన్ని దీర్ఘకాలం పాటు ప్రభావితం చేస్తాయి. ఈ నాయకత్వ నష్టాలతో పాటు పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాలు, ప్రజాసంఘాల నాయకులు-కార్యకర్తలు, విప్లవ ప్రజలు పెద్దసంఖ్యలో అమరులయ్యారు. దీంతో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ., ప్రజాసంఘాలు, విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయాయి/నష్టపోయింది.

ఈ స్థితిలో కేంద్రకమిటీ, పొలిట్ బ్యూరో రూపొందించిన రాజకీయ, సైనిక ఎత్తుగడలను సరిగా అమలు చేస్తూ, ఆచరిస్తూ ఈ నష్టాలను నివారించుకోవాలి. ఈ నష్టాల నివారణ ద్వారా పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం, వాటిని పునర్నిర్మిద్దాం.

మార్చి 31, 2026 తర్వాత కూడా విప్లవ ప్రతిఘాతక యుద్ధం కగార్ పేరుతోనో, మరో పేరుతోనో కొనసాగుతుంది. కగార్ లక్ష్యం మావోయిస్టులను నిర్మూలించి, 'కార్పొరేట్ హిందూ దేశాన్ని' నిర్మించడం కాబట్టి, దేశంలో కార్పొరేటీకరణను, సైనికీకరణను, హిందుత్వను వ్యతిరేకించే వారందరిని మావోయిస్టులుగా, అర్బన్ మావోయిస్టులుగా ముద్రవేసి వారందరిపై ఫాసిస్టు దాడులు చేయడం కోసం ఆర్ఎస్ఎస్-బీజేపీ వాటి అనుబంధ సంస్థలు, వాటి నాయకత్వంలో నడిచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్నాహాలు చేస్తూనే వున్నాయి. ఈ విషయాన్ని గమనంలో వుంచుకుని స్వీయాత్మక శక్తులను రక్షించుకోవాలి. కార్పోరేటీకరణను, సైనికీకరణను, హిందుత్వను వ్యతిరేకించే వ్యక్తులను, శక్తులను, సంఘాలను, సంస్థలను, పార్టీలను కలుపుకుని సామాజిక జీవితానికి చెందిన సకల రంగాల్లో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే మన స్వీయాత్మక శక్తులను రక్షించుకోగలుగుతాం.

**2. సోను, సతీష్ విప్లవ ద్రోహుల ముఠా సృష్టించిన సంక్షోభాన్ని అధిగమించాలి.**

విప్లవ ద్రోహులుగా, పార్టీ విచ్ఛిన్నకులుగా, విప్లవ ప్రతిఘాతకులుగా మారి అక్టోబర్ 14, 16 తేదీల్లో సోను, సతీష్ ల ముఠా శత్రువుకు లొంగిపోయి, పార్టీకి చెందిన 203 ఆయుధాలను శత్రువుకు అప్పగించింది. ఈ ముఠా ప్రభావంతో అక్టోబర్ చివర్లో దండకారణ్యంలోని ఉత్తర్ బస్తర్ లో 21 మంది 18 ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి లొంగిపోయారు, ఒడిశా రాష్ట్రకమిటీ పరిధిలోని ధంతరి-గరియబంద్-నువాపాడ డివిజన్ లో నవంబర్ మొదటి వారంలో 7 గురు 6 ఆయుధాల్ని శత్రవుకు అప్పగించి లొంగిపోయారు. ఈ రకంగా అక్టోబర్-నవంబర్ నెలల్లో 299 మంది శత్రువుకు లొంగిపోయి 227 ఆయుధాల్ని శత్రువుకు అప్పగించారు.

సోను, సతీష్ ల ముఠా మన రాజకీయ-సైనిక పంథాపై దాడిచేసి భారీ సంఖ్యలో ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి పార్టీలో సంక్షోభాన్ని సృష్టించారు. దేశవ్యాప్తంగా నిజాయితీ కలిగిన విప్లవ శక్తులు, కగార్ యుద్ధానికి వెరవని శక్తులు సోను, సతీష్ ల ముఠా చేస్తున్న వాదనల్లోని బూటకాన్ని, డొల్లతనాన్ని వెంటనే గ్రహించారు, వారిని విప్లవ ద్రోహులుగా గుర్తించారు. అయితే ఇప్పటికీ దేశవ్యాప్తంగా మనపార్టీలోని, పీ.ఎల్.జీ.ఏ.లోని కొంతమందిలో, విప్లవ శిబిరంలోని ఒక సెక్షన్ లో సోను, సతీష్ ల వాదనలతో గందరగోళానికి, నిరాశకు గురయిన స్థితి ఉంది. అందుకే సోను, సతీష్ ల వాదనల్లోని మోసాన్ని/బూటకాన్ని, డొల్లతనాన్ని బహిర్గతం చేసి వారిలోని నిరాశను తొలగించి వారిని మన రాజకీయ-మిలిటరీ పంథాపై దృఢంగా నిలబెట్టాలి.

మనపార్టీ అనుసరిస్తున్న రాజకీయ-సైనిక పంథా తప్పు అని నిర్ధారించడానికి సోను, మనకు విప్లవ పార్టీ లేదు, 2007 నాటి కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర కర్తవ్యం ఉద్యమ బలానికి మించిన అతివాద నిర్ణయం, చట్టబద్ధ పోరాటాలను తిరస్కరించాం అనే మూడు ప్రధాన కారణాలను చెప్పాడు.

'పార్టీ అన్నపుడు పూర్తికాలం విప్లవకారులతో కూడిన అన్ని స్థాయిల పార్టీకమిటీలే' అనే విచిత్రమైన వాదనను ముందుకు తెచ్చి దేశవ్యాప్తంగా ఉన్న పార్ట్ టైమ్ పార్టీ సభ్యులతో కూడిన

పార్టీని పార్టీ కాదని తిరస్కరించాడు. పూర్తికాలపు విప్లవకారులతో కూడిన పార్టీ కమిటీలు సాయుధంగా ఉంటూ పని చేస్తున్నందుకు వీటన్నింటిని పార్టీగా గుర్తించడానికి నిరాకరిస్తూ వాటిని సైన్యంగా చిత్రీకరించాడు. కార్పెట్ సెక్యూరిటీ రీత్యా ఏసీ, డీవీసీ/డీసీ సభ్యులు, పార్టీ సభ్యులు ఆయుధాలు లేకుండా సివిల్ లో ఉండి మాస్ వర్క్ చేస్తున్నప్పటికీ వాటిని/వారిని కూడా పార్టీగా గుర్తించడానికి నిరాకరించాడు. ఇవన్నీ వాస్తవాలకు భిన్నమైన తప్పుడు నిర్ధారణలే. ఆయన దృష్టిలో ఆయుధాలు పట్టుకోకుండా, గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల మధ్య ఉండే పార్టీ కమిటీలే పార్టీ. అంటే ఆయన వాదనల ప్రకారం విప్లవ పార్టీ అంటే గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజల మధ్య పార్ట్ టైం పార్టీ సభ్యులతో కూడిన పార్టీ వ్యవస్థ పార్టీ కాదు, సాయుధమయి పనిచేసే ఏరియా కమిటీ నుండి కేంద్రకమిటీ వరకున్న పార్టీ కమిటీలు పార్టీ కాదు. ఇవన్నీ విప్లవ పార్టీ నిర్మాణం, పనివిధానంపై తప్పుడు సైద్ధాంతిక వాదనలు, ఇవి కేవలం మితవాద, రివిజనిస్టు వాదనలే.

2007 నాటి కాంగ్రెస్ రూపొందించిన కేంద్ర కర్తవ్యం ఉద్యమ బలానికి మించిన అతివాద నిర్ణయం అనడం కూడా మితవాద అవకాశవాద, రివిజనిస్టు వాదనే. 2007 నాటికి దండకారణ్యంలో 27 ఏళ్ల పాటు వర్గపోరాటం సాగి ఆ ప్రాంతం గెరిల్లా జోన్ గా ఎదిగింది, బిహార్-ఝార్ఖండ్ లో 37 ఏళ్ల పాటు వర్గపోరాటం సాగి ఆ ప్రాంతం గెరిల్లా జోన్ గా ఎదిగింది. ఆ రెండు ప్రాంతాల్లో విప్లవోద్యమం విస్తృతమైన, పటిష్టమైన ప్రజాపునాది కలిగి ఉండేది. ఈ రెండు ప్రాంతాలతో పాటు దేశంలోని కొన్ని ప్రాంతాల్లో విప్లవోద్యమం ఎర్రప్రతిఘటనా స్థాయిలో ఉండగా, మరికొన్ని ప్రాంతాలు తాత్కాలిక వెనకంజ స్థితిలో ఉండేవి. వీటికి తోడుగా రెండు విప్లవ పార్టీల విలీనంతో మావోయిస్టు పార్టీ ఏర్పడిన స్థితిలో దేశవ్యాప్తంగా విప్లవ శిబిరంలో గొప్ప ఉత్సాహం, విశ్వాసం నెలకొన్న స్థితి ఉండింది. ఈ స్థితినంతటిని పరిగణనలోకి తీసుకుని, ఆనాటి అంతర్జాతీయ, దేశీయ రాజకీయ పరిస్థితులను గమనంలో వుంచుకుని దండకారణ్య, బిహార్-ఝార్ఖండ్ ప్రాంతాలను విముక్తి ప్రాంతాలుగా అభివృద్ధి చేసే కేంద్ర కర్తవ్యాన్ని కాంగ్రెస్ రూపొందించింది. ఈ ప్రాంతాల్లో విముక్తి ప్రాంతాలు నిర్మించాలంటే ఎర్ర ప్రతిఘటనా స్థాయిలో ఉన్న ఉద్యమాలను సంఘటితం చేసుకుంటూ వాటిని గెరిల్లా జోన్లుగా అభివృద్ధి చేయాలని, తాత్కాలిక వెనకంజలో వున్న ఉద్యమాలను తిరిగి ముందంజలోకి తీసుకరావాలని, పట్టణోద్యమాన్ని అభివృద్ధి చేయాలని కాంగ్రెస్ తక్షణ కర్తవ్యాలను రూపొందించింది. ఈ కర్తవ్యాల సాధన కోసం పార్టీలో వున్న అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకొని, మావోయిస్టు పనిశైలిలో పనిచేయాలని కాంగ్రెస్ యావత్తు పార్టీకి నిర్దేశించింది. అయితే మన పార్టీలోని అన్యవర్గ ధోరణులను సరిదిద్దుకోవడానికి తీవ్రంగా కృషి చేయని ఫలితంగా; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగించిన తీవ్రమైన అణచివేత దాడులతో 2012 నాటికి దేశవ్యాప్త విప్లవోద్యమం గడ్డుస్థితికి చేరింది. ఈ స్థితిలో ప్రజావిముక్తి గెరిల్లా సైన్యాన్ని రెగులర్ సైన్యంగా అభివృద్ధి చేసే కర్తవ్యాన్ని, గెరిల్లాయుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి చేసే కర్తవ్యాన్ని నెరవేర్చలేమని కేంద్రకమిటీ నిర్ణయించి, కేంద్ర కర్తవ్యంలో మార్పు చేసింది. ఈ వాస్తవాన్ని పక్కనపెట్టి కాంగ్రెస్ నిర్దేశిత కేంద్ర

కర్తవ్యం అతివాదమనడం అంటే ఉద్యమ బలాబలాలపై ఆధారపడి రాజ్యాధికార స్వాధీనం కోసం పోరాడకుండా కేవలం పాక్షిక పోరాటాలను, ఆర్థిక పోరాటాలను నడిపే స్థాయిలోనే విప్లవోద్యమాన్ని పరిమితం చేయాలనడం అవుతుంది. అంటే విప్లవోద్యమాన్ని ఆర్థికవాద, సంస్కరణవాదానికి బలి చేయడమే అవుతుంది, ఉద్యమాన్ని చట్టబద్ధ పరిధిలోనే నడపాలనే చట్టబద్ధ వాదమవుతుంది.

చట్టబద్ధ పోరాటాలను కాలదన్నుకున్నాం అనే వాదన కూడా అవాస్తవం, వాస్తవాల వక్రీకరణ. 2007 నాటికి ఉత్తర తెలంగాణ, ఆంధ్ర, ఏఓబీ ఉద్యమాలు తాత్కాలిక వెనకంజకు గురయిన స్థితిలో అక్కడ ఉద్యమ బలం తగ్గిన స్థితిని పరిగణనలోకి తీసుకుని ఆ ప్రాంతాల్లో పార్టీ అనేక చట్టబద్ధ-బహిరంగ పోరాటాలను నడిపింది. అందులో భాగంగా ప్రత్యేక తెలంగాణ రాజకీయ ఉద్యమాన్ని నడిపింది. తెలంగాణ, ఏఓబీలోని ఆదివాసీ ప్రాంతాల్లో 5వ షెడ్యూల్, పెసాచట్టం అమలు కోసం పోరాటాలు చేసింది. 2006 నుండి 2011 మధ్యకాలంలో పశ్చిమ బెంగాల్ లో చట్టబద్ధ, చట్టవ్యతిరేక పోరాటాలను సమన్వయించి సింగూర్, నందిగ్రామ్ పోరాటాలను నడిపాం. ఇదే కాలంలో ఏఓబీలో భూమి సమస్యపై నారాయణపట్నా పోరాటాన్ని నడిపాం. 2008లో కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ చట్టాన్ని రూపొందించినపుడు, విప్లవోద్యమం దెబ్బతిన్న ప్రాంతాల్లో, నూతనంగా విస్తరించిన ప్రాంతాల్లో, ఉద్యమం ప్రాథమిక స్థాయిలో ఉన్న ప్రాంతాల్లో ఆ చట్టంలోని ప్రజానుకూల అంశాల కోసం పోరాడాలనీ ఉద్యమం బలంగా ఉండి ప్రజారాజ్యాధికార సంస్థలు (జనతన సర్కార్లు) ఏర్పడ్డ చోట ప్రజారాజ్యాధికార సంస్థలే ఆదివాసుల భూములకు పట్టాలివ్వాలని కేంద్రకమిటీ నిర్ణయించింది. 2013లో సీ.ఆర్.బీ., దోపిడీ వర్గాల సంస్కరణల పట్ల పార్టీ వైఖరిని తెలుపుతూ ఒక పత్రాన్ని రూపొందించింది. అందులో ఉద్యమ బలాబలాల ఆధారంగా/ఉద్యమ బలాబలాల్లోని మార్పులను వెన్నంటి చట్టబద్ధ-చట్టవ్యతిరేక, రహస్య-బహిరంగ పోరాట రూపాలను ఉపయోగించుకుని వర్గపోరాటాన్ని నడపాలని నిర్ణయించింది. తదనంతరం గఢ్చిరోలీ జిల్లాలో పెసా, గ్రామసభల ఏర్పాటు కోసం ఉద్యమాన్ని నడిపాం. 2021 నుండి దండకారణ్య వ్యాప్తంగా పెసా, గ్రామసభల కోసం బహిరంగ-చట్టబద్ధ ఉద్యమం కొనసాగుతూ వచ్చింది. మావోయిస్టు పార్టీ ఏర్పడినప్పటి నుండి దేశవ్యాప్తంగా ఉద్యమ ప్రాంతాల్లో విస్థాపనకు వ్యతిరేకంగా చట్టబద్ధ-బహిరంగ ప్రజా ఉద్యమాన్ని పార్టీ నడిపింది. ఈ వాస్తవాలను పక్కనబెట్టి డీకే విషయాన్ని ఏకైకం చేసి, దాన్ని కూడా వక్రీకరించి చట్టబద్ధ పోరాటాలను కాలదన్నుకున్నాం అనడం అంటే ఉద్యమాన్ని చట్టబద్ధ పోరాటాలకే పరిమితం చేయాలనే రివిజనిస్టు వాదనే.

సోను ఈ మధ్యకాలంలో రాసిన రెండు వ్యాసాలను, సాయుధ పోరాట తాత్కాలిక విరమణ ప్రకటనను, ప్రజలకు విజ్ఞప్తిని, కాడర్లకు విజ్ఞప్తిని కలిపి చూస్తే, అందులో మన పార్టీ అనుసరిస్తున్న విప్లవ పంథాను తిరస్కరించడమే కాకుండా, సాయుధ పోరాటాన్నే తిరస్కరించడం ఉంది. ప్రత్యమ్నాయ పంథా ఏమీ లేదు. ఆయన పంథా లొంగుబాటు పంథా. ఆయన వాదనల మొత్తం

సారాంశం చట్టబద్ద పద్ధతుల్లో ప్రజా పోరాటాలు నడపడం, రహస్య పార్టీ లేదనే పేరుతో పార్టీని బహిరంగ పార్టీగా మార్చడం.

ఇవి సైద్ధాంతికంగా రివిజనిజం. పార్టీ చెప్పిన దానిని తిరస్కరించి పార్టీకి చెందిన ఆయుధాల్ని శత్రువుకు అప్పగించి విప్లవ ప్రతిఘాతకుడిగా మారాడు. తన అనుచరులను కూడగట్టుకుని పార్టీని చీలదీసాడు. వీటన్నింటితో సతీష్ ఏకీభవించి ఆయన కూడా విప్లవ ద్రోహిగా, పార్టీ విచ్ఛిన్నకుడిగా, విప్లవ ప్రతిఘాతకుడిగా మారాడు. అందుకే సోను, సతీష్ లు లేవనెత్తిన వాదనల్లోని మోసాన్ని, డొల్లను యావత్తు విప్లవ శిబిరానికి అర్థం చేయించి, విప్లవ శిబిరంలో తలెత్తిన గందరగోళాన్ని తొలగించి స్పష్టతను కల్పించాలి, వారిలో నెలకొన్న నిరాశను తొలగించి ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. సోను, సతీష్ లు ముందుకు తెచ్చిన వాదనల్లో నిజాయితీ ఏమాత్రం లేదు. వాళ్లిద్దరు కేవలం ప్రాణభీతితో తమ లొంగుబాటును సమర్థించుకోవడానికి చేసిన వాదనలే అవి. పార్టీ ప్రధాన కార్యదర్శే సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించాలన్నడనే అబద్దాలాడి, సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనంగా ఉన్న కాడర్లను మోసగించి వారిని శత్రువు ముందు లొంగిపోయేలా చేసారు. అందుకే వాళ్లిద్దరి మోసకారితనాన్ని విప్లవ శిబిరంలో బహిర్గతం చేయాలి.

**3. సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి.**

మన కేంద్రకమిటీ రూపొందించిన 'భారతదేశంలో ఉత్పత్తి సంబంధాల్లో మార్పులు–మన రాజకీయ కార్యక్రమం' (ఎంఓపీ డాక్యుమెంట్), 'భారతదేశంలో కులసమస్య–మన దృక్పథం', 'భారతదేశంలో జాతుల సమస్య–మన పార్టీ వైఖరి' డాక్యుమెంట్ల గైడెన్స్ లో పీడిత వర్గాలను (కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి (పెటిబూర్జువా), జాతీయ పెట్టుబడిదార్లు), పీడిత సామాజిక సెక్షన్లను (మహిళలు, దళితులు, ఆదివాసులు, మత మైనారిటీలు), పీడిత జాతులను సమీకరించి వర్గ సమస్యలపై, సామాజిక సమస్యలపై, జాతుల సమస్యలపై వర్గపోరాటాన్ని నడపాలి. దేశంలోని అసమనాభివృద్ధిని అనుసరించి దేశాన్ని 7 కేటగిలుగా గుర్తించి ఆయా ప్రాంతాలకు వర్తించే రాజకీయ కార్యక్రమాన్ని ఎంఓపీ డాక్యుమెంట్ రూపొందించింది. ఆ రాజకీయ కార్యక్రమం ఆధారంగా మనం వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. 2014లో కేంద్రంలో బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్–బీజేపీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అది రాజ్య ఫాసిజంగా మారింది. అప్పటినుండి దేశంలోని పీడిత వర్గాలపై, పీడిత సామాజిక సెక్షన్లపై, పీడిత జాతులపై ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో మొత్తంగా సామాజిక జీవితానికి చెందిన అన్నిరంగాల్లో దాడులు చేస్తూనే ఉంది. అందులో భాగంగానే మావోయిస్టులను నిర్మూలించి 'మావోయిస్టు రహిత' భారతాన్ని ఏర్పాటు చేస్తానంటోంది. దేశంలోని ఎన్ ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐలను, ఎన్నికల సంఘాన్ని, న్యాయవ్యవస్థను అన్నింటిని

బెదిరించి, లొంగదీసుకుని తమకు అనుకూలంగా మార్చుకుని పోరాడే ప్రజలపై, ప్రతిపక్షాలపై దాడులు చేయిస్తున్నది. అందులో భాగంగానే 'ప్రతిపక్ష రహిత' (విపక్ష్ ముక్త్) భారతాన్ని ఏర్పాటు చేస్తానంటోంది. అందుకే నేడు అది దేశానికి, దేశ ప్రజలకు ప్రధాన శత్రువుగా మారింది. ఈ స్థితిలో దేశవ్యాప్తంగా మనపార్టీ యూనిట్లు ఉన్న ప్రతిచోట దానికి వ్యతిరేకంగా కలిసివచ్చే వ్యక్తులను, శక్తులను, సంఘాలను, సంస్థలను, పార్టీలను కలుపుకుని, బూర్జువా పార్టీలను కూడా ఎత్తుగడలపరమైన మిత్రులుగా కలుపుకుని ఐక్యకార్యాచరణ కార్యక్రమాలు–ఐక్య కార్యాచరణ వేదికలు ఏర్పాటు చేసుకుని వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలి. అలాగే, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్–బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా (వికసిత్ భారత్) చేస్తామనే ప్రచార హోరులోని బూటకాన్ని, మోసాన్ని నిరంతరం సరైన ఆధారాలతో ఎండగట్టాలి. ఈ సంవత్సరం ఏప్రిల్ లో జమ్మూ–కశ్మీర్ లో పహల్గావ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిని సాకుగా చూపెట్టి భారతదేశం పాకిస్తాన్ పై 'ఆపరేషన్ సింధూర్' పేరుతో మిలిటరీ ఆపరేషన్స్ చేసింది. పాకిస్తాన్ తో నయినా సరిహద్దుల్లో ఉన్న ఏ దేశంతోనయినా సరిహద్దు వివాదంతో సహ ఏ సమస్యనయినా శాంతియుత పద్ధతుల్లో, చర్చల ద్వారా, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలి. దానికి భిన్నంగా మిలిటరీ ఆపరేషన్స్ ద్వారా, యుద్ధం ద్వారా సమస్య పరిష్కారానికి పూనుకోవడం సరైంది కాదు. ఈ పద్ధతికి భిన్నంగా పాకిస్తాన్ పై మిలిటరీ ఆపరేషన్స్ చేపట్టింది. అయితే, అమెరికా ఆదేశాలతో నాలుగు రోజులకే ఆ ఆపరేషన్స్ ను ఆపివేసి తన లొంగుబాటును ప్రదర్శించుకుంది. ఒకవైపు అమెరికా పట్ల లొంగుబాటును ప్రదర్శిస్తూనే గత 7 నెలలుగా భారతదేశ ప్రజల్లో జాతీయ దురహంకారాన్ని, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొడుతూనే ఉంది. గత 11 సంవత్సరాలుగా బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంటూ దేశంలో పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, అధిక ధరలను, రైతాంగపు ఆత్మహత్యల్ని వగైరా దేశం ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్యల్ని పరిష్కరించలేక విఫలమవుతూనే ఈ సమస్యలపై పోరాడే ప్రజానీకాన్ని పక్కతోవ పట్టించేందుకు నిరంతరం హిందూ మతోన్మాదాన్ని, యుద్ధోన్మాదాన్ని ఎగదోస్తూనే ఉంది. బీజేపీకి, మోదీకి ఆశ్రితుడైన అదానీకి దేశ సంపదలను అప్పనంగా అప్పజెప్తూనే వుంది. అదానీ అమెరికాలో వ్యాపార అక్రమాలకు పాల్పడినందుకు ఆయనను కాపాడేందుకు దేశ ప్రయోజనాలను అమెరికాకు తాకట్టు పెడుతోంది. దేశ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఇజ్రాయిల్ తో, ఆఫ్ఘనిస్తాన్ తో అనేక ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. గత 11 సంవత్సరాల బీజేపీ మనువాద పాలనలో దళితులపై, ఆదివాసులపై దాడులు పెరగడమే కాకుండా దళిత, బహుజన ఉన్నతాధికారులపై (ఐఏఎస్, ఐపీఎస్ తదితర) కూడా మనువాద అధికారుల పీడన, అవమానాలు పెరిగిపోయాయి. గత 11 సంవత్సరాల్లో వ్యవసాయిక, పారిశ్రామిక, సేవా రంగాల్లో దేశ, విదేశీ కార్పొరేట్ల దోపిడీ, పీడనలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటన్నింటి ఫలితంగా దేశంలోని విశాల ప్రజానీకం తరతమ స్థాయిలో పోరాటాలు చేస్తూనే వున్నారు. ఈ స్థితిలో, మనువాద ఆర్ఎస్ఎస్–బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ ప్రజలకు వ్యతిరేకంగా

అనుసరిస్తున్న, ఆచరిస్తున్న అన్ని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విధానాలకు వ్యతిరేకంగా, కార్పొరేట్ల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రచార, ఆందోళన, పోరాట కార్యక్రమాల్ని చేపట్టి ప్రజా పునాదిని పెంచుకోవాలి. దేశవ్యాప్తంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేస్తూ ప్రజాపునాదిని పెంచుకుంటూ దాని ఆధారంగా గెరిల్లాయుద్ధాన్ని కొనసాగిద్దాం.

**డియర్ కామ్రేడ్స్, ప్రజలారా!**

1973 నుండి మొదలైన సామ్రాజ్యవాద సాధారణ సంక్షోభపు పరిష్కారం కోసం సామ్రాజ్యవాదం ముందుకు తెచ్చిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ 2008 నాటికి ప్రపంచ ఆర్థిక సంక్షోభంతో విఫలమైందిగా తేలిపోయింది. ఈ సంక్షోభం ఇప్పటికీ పరిష్కరించబడలేదు. దాని పరిష్కారం కోసం పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాలు, వెనకబడిన దేశాలు అనుసరించిన /అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, సైనిక, సాంకేతిక విధానాలన్ని ఘోరంగా విఫలమయ్యాయి/ విఫలమవుతున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణను వెన్నంటి ఆ విధానాల అమలుకోసం ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో మితవాద (రైట్ వింగ్), రేసిస్టు (జాత్యాహంకార), ఫాసిస్టు పార్టీలు అధికారంలోకి వచ్చాయి. ఈ మితవాద, జాత్యాహంకార, ఫాసిస్టు పార్టీలు తమ తమ దేశాల్లో బూర్జువా ప్రజాస్వామిక హక్కులను సైతం కాలరాచి నియంతృత్వాన్ని, ఫాసిజాన్ని అమలు చేస్తున్నాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమల్లో భాగంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి దాడి తీవ్రంగా సాగినప్పటికీ, దాని దాడి పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాల్లోని కార్మికవర్గంపై, మధ్యతరగతిపై కూడా కొనసాగుతూనే ఉంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడి దళారీలుగా అక్కడి దళారీ నిరంకుశ బూర్జువా వర్గం, భూస్వామ్య వర్గం వ్యవహరిస్తూ ఈ మూడింటి కూటమి ఆయా దేశాల ప్రజలపై దోపిడీ, పీడనలను తీవ్రతరం చేసాయి. వీటికి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో ప్రజాపోరాటాలు తరతమ మోతాదుల్లో కొనసాగుతూనే ఉన్నాయి. 2012-13 మధ్యకాలంలో ఆఫ్రికా దేశాల్లో 'గులాబి విప్లవాలు' చెలరేగిన వాటితో దోపిడీ వ్యవస్థలో మార్పు రాలేదు. గత 3-4 సంవత్సరాల్లో ఈ మధ్యకాలంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, ఫిలిప్పీన్స్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ ల్లోని ప్రజా తిరుగుబాట్లకు తక్షణ కారణాలుగా పైకి కనపడే కారణాలు కొన్ని వున్నప్పటికీ వీటి వెనక సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, ఆయా దేశాల్లోని దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (కార్పొరేట్ కంపెనీల), భూస్వామ్య వర్గాల దోపిడీ, పీడనల తీవ్రతే ప్రధాన కారణం. ఈ మధ్యకాలంలో పశ్చిమ యూరప్ దేశాల్లో కూడా కార్మికులు, మధ్యతరగతి ద్రవ్యపెట్టుబడి దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. అమెరికాలోని న్యూయర్క్ నగర మేయర్ గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ గెలవడం మితవాద, రేసిస్టు, ఫాసిస్టు ట్రంప్ పరిపాలన పట్ల ఆ నగర ప్రజల్లోని కార్మికుల, మధ్యతరగతి ఉద్యోగుల, వలస ప్రజల (ఇమ్మిగ్రేంట్స్) వ్యతిరేకత కారణం. అలాగే గత 2-3 సంవత్సరాల్లో యూరప్ తదితర దేశాల్లో మితవాద, రేసిస్టు, ఫాసిస్టు పార్టీల

స్థానంలో సోషల్ డెమొక్రటిక్ పార్టీలు, డెమొక్రటిక్ పార్టీల అభ్యర్థులు గెలుపొందడానికి కూడా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పట్ల, మితవాద, ఫాసిస్టు శక్తుల పట్ల పెరుగుతున్న వ్యతిరేకతే కారణం. రానున్న రోజుల్లో ఇది మరింత తీవ్రతరం కానుంది. ఈ స్థితిని ఉపయోగించుకుని ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవకారులు తమ దేశాల్లో విప్లవ పార్టీగా సంఘటితం కావాలి, చిన్న పార్టీని పెద్ద పార్టీగా అభివృద్ధి చేసుకోవాలి, బలహీనంగా ఉన్న పార్టీని బలోపేతం చేసుకోవాలి.

గత సంవత్సర కాలంగా అమెరికా–చైనాల మధ్య కొనసాగుతున్న సుంకాల పోటీ (టారిఫ్ వార్) ఈ మధ్య నవంబర్ మొదటి వారంలో దక్షిణ కొరియాలోని బూసాన్ లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ లు సమావేశమయి తాత్కాలిక సంధి కుదుర్చుకోవడంతో తాత్కాలికంగా విరమించబడింది. రెండు దేశాలు వాణిజ్య సుంకాలకు ఏడాది కాలం పాటు విరామం ప్రకటించాయి. చైనా దిగుమతులపై విధించిన సుంకాల్లో 10 శాతం తగ్గించాలని అమెరికా నిర్ణయించింది. అలాగే అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్ మినరల్స్) ఎగుమతులపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని చైనా నిర్ణయం తీసుకుంది. ఆర్థిక మాంద్యంతో సతమతమవుతున్న అమెరికా, చైనాలు ఈ నిర్ణయం తీసుకోక తప్పని స్థితి నెలకొంది. ఈ తాత్కాలిక ఒప్పందంతో అమెరికా, చైనాల మధ్యనున్న పోరు ఆగేది కాదు. ఇరుదేశాలు ప్రపంచాధిపత్యం కోసం పోటీపడుతున్నాయి. ఈ పోటీని అనుసరించి రానున్న రోజుల్లో అమెరికా–చైనాల మధ్య అన్నిరంగాల్లో ఘర్షణలు తలెత్తడం అనివార్యం.

పెట్టుబడిదారీ విధానం ఉనికిలోకి వచ్చినప్పటి నుండి ముఖ్యంగా అది సామ్రాజ్యవాదంగా మారినప్పటినుండి అది పర్యావరణ వినాశకారిగా మారింది. దీంతో నేడు మానవ మనుగడే కాకుండా భూగోళపు మనుగడే ప్రమాదంలో పడింది. ఈ స్థితిలో ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ శిఖరాగ్ర సమావేశాల ద్వారా జరిగేది ఏమిలేదని తేలిపోయింది. పెట్టుబడిదారీ–సామ్రాజ్యవాద వ్యవస్థను నిర్మూలించే లక్ష్యంతో పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలు సాగినపుడే పర్యావరణాన్ని, భూమండలాన్ని, మానవ మనుగడను కాపాడుకోవచ్చు. ఆ దిశగా ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు విప్లవకారులే పర్యావరణ పరిరక్షణ ఉద్యమాల్ని నడపాలి.

అమెరికా ప్రపంచ దేశాలపై విధిస్తున్న సుంకాల్లో భాగంగా భారతదేశంపై ఆగస్టులో 25 శాతం సుంకాల్ని విధించింది. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నారనే పేరుతో ఆ సుంకాలను 25 శాతం పెంచడంతో అవి 50 శాతానికి చేరాయి. దీంతో భారత ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఈ స్థితిలో అమెరికాను సంతృప్తి పర్చడానికి భారతదేశం రష్యా నుండి చమురు కొనుగోలును చాలావరకు తగ్గించింది. అమెరికా నుండి మనదేశం దిగుమతి చేసుకునే పత్తిపై ఉన్న 11 శాతం సుంకం మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించింది. రానున్న రోజుల్లో ఈ సుంకాన్ని ఎత్తివేయాలని యోచిస్తోంది. ఇది అమెరికా ఎదుట భారతదేశపు లొంగుబాటే. ఈ స్థితిలో, చర్చల్లో ఉన్న భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం భారత ప్రజలకు

వ్యతిరేకంగానే తయారవుతుంది. కాబట్టి భారత ప్రజలందరూ ముఖ్యంగా రైతాంగం, పాల ఉత్పత్తిదార్లు, మత్స్యకారులు భారత ప్రభుత్వపు లొంగుబాటుకు వ్యతిరేకంగా పోరాడాలి. ఆత్మ నిర్భరత (స్వావలంబన) పేరుతో ప్రధాని మోదీ వల్లించే మాటలు వట్టి బూటకాలని అర్థం చేసుకోవాలి. సామ్రాజ్యవాద దేశాలతో చేసుకున్న అన్నిరకాల అసమాన ఆర్థిక, వ్యాపార, వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసుకున్నపుడే స్వావలంబన సాధ్యమవుతుంది. అది జాతీయ ప్రజాస్వామిక విప్లవం ద్వారానే సాధ్యమవుతుంది. మనదేశ సార్వభౌమత్వాన్ని, స్వతంత్రతను సాధించుకున్నపుడే స్వావలంబన సాధ్యమవుతుంది. ఈ పనిని దోపిడీ వర్గ రాజకీయ పార్టీలు సాధించలేవు. అందుకే మావోయిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న విప్లవోద్యమాన్ని విజయవంతం చేయడమే మార్గం.

ఎన్నికల సంఘాన్ని తమ జేబు సంస్థగా మార్చుకుని బీజేపీ పార్టీ ఓట్ల దొంగతనానికి, అనేక అక్రమాలకు పాల్పడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తూ వస్తోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా అనేక అక్రమాలకు, ఓట్ల దొంగతనానికి పాల్పడి గెలిచింది. ఈ స్థితిలో నేటి పార్లమెంటరీ వ్యవస్థ ఎంత బూటకమో మరోసారి తేలిపోయింది. ఈ స్థితిలో నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవడమంటే నూతన ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించుకోవడమే. అందుకోసం దేశంలోని విశాల ప్రజానీకం సంఘటితమయి, సాయుధమయి ఈ దోపిడి వ్యవస్థను కూలదోయాలి.

**ప్రియమైన కామ్రేడ్స్, ప్రజలారా!**

ప్రస్తుతం విప్లవోద్యమం తీవ్రంగా నష్టపోయిన స్థితిలో గతంలాగా మనం పీ.ఎల్.జీ.ఏ. వార్షికోత్సవాలను జరుపుకోలేం. కాబట్టి ఉద్యమ ప్రాంతాల్లో పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. బలగాల రక్షణకు ప్రాధాన్యతనిస్తూనే ఈ వార్షికోత్సవాలను జరుపుకోవాలి. దేశవ్యాప్తంగా అటవీ, మైదాన, పట్టణ ప్రాంతాల్లో అన్నిచోట్ల గ్రూపు మీటింగులు, చిన్న చిన్న మీటింగుల రూపంలో, రహస్య పద్ధతుల్లో ఈ వార్షికోత్సవాలను జరుపుకోవాలి. ఉద్యమ ప్రాంతాలంతటా పోస్టర్లు వేసి, కరపత్రాలు పంచి ప్రజల్లో పీ.ఎల్.జీ.ఏ.ను బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తింపచేయాలి. తగిన అర్హతలున్న వారిని పీ.ఎల్.జీ.ఏ.లోకి భర్తీ చేసుకోవాలి.

- ★ విప్లవ ప్రతిఘాతక 'కగార్' యుద్ధం నుండి పార్టీని, పీ.ఎల్.జీ.ఏ.ను, ప్రజాసంఘాలను, విప్లవోద్యమాన్ని కాపాడుకుందాం.
- ★ సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ (విదేశీ, దేశీయ కార్పోరేట్ కంపెనీలు), భూస్వామ్య వర్గాల కూటమికి వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని తీవ్రతరం చేద్దాం.
- ★ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు ఆర్ఎస్ఎస్-బీజేపీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను తీవ్రతరం చేద్దాం.
- ★ నష్టాలను నివారించుకుందాం. లొంగుబాట్లను, విప్లవ ద్రోహాన్ని వ్యతిరేకిద్దాం. పీడిత ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు దృఢంగా పోరాడుదాం.
- ★ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి.
- ★ భారత నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి.
- ★ ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీ.ఎల్.జీ.ఏ.) వర్ధిల్లాలి.
- ★ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) వర్ధిల్లాలి.

విప్లవాభినందనలతో,

సెంట్రల్ మిలిటరీ కమిషన్

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

**14.11.2025.**